సాక్షి చిత్తూరు

ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



శ్రీవారి సేవలో వీవీఎస్ లక్ష్మణ్

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం ఇండియన్ మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.



కాలుష్యరహిత బండి..

తిరుమల : తిరుమలలో విద్యుత్ బస్సులకు విశేష ఆదరణ లభిస్తోంది. ఇటీవల ధర్మరథం పేరుతో ఏర్పాటు చేసిన విద్యుత్ బస్సును ఎక్కేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	40	23
తిరుపతి	41	24
తిరుమల	36	19
గూడూరు	42	26
నగరి	41	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం(సా)	సహర్ సోమవారం(ఉ)
తిరుపతి	6.29	4.39
చిత్తూరు	6.31	4.37
పుంగనూరు	6.32	4.41

న్యూస్‌రీల్

ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్‌పై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ మోహన్ నాయక్

రామకుప్పం: ద్రవిడ యూనివర్సిటీలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతికి గిరిజన నాయకులను ఆహ్వానించకపోవడంపై ప్రశ్నించినందుకు కులం పేరుతో దూషించారని పెద్దతాండా సర్పంచ్ మోహన్‌నాయక్ మండిపడ్డారు. శనివారం ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'వాత్సల్య'కు 250 దరఖాస్తులు

చిత్తూరు రూరల్: మిషన్ వాత్సల్య పథకానికి చిత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి నుంచి 250 దరఖాస్తులు వచ్చినట్లు సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 130 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. మిగిలినవి త్వరితగతిన ఆన్‌లైన్ చేయనున్నట్లు వెల్లడించారు.

సకాలంలో 'విద్యాకానుక'



జేవీకే కమిటీ సభ్యులతో పరిశీలకుడు రవీంద్రబాబు

ఐరాల : విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే సకాలంలో పిల్లలకు జగనన్న విద్యాకానుక కిట్‌లు (జేవీకే) పంపిణీ చేయనున్నట్లు జేవీకే రాష్ట్ర పరిశీలకుడు కె.రవీంద్రబాబు, ఎస్ఎస్ఏ, సీఎంఓ గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జేవీకే కిట్లను భద్రపరిచే గదులను పరిశీలించారు. అనంతరం మండలస్థాయి కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టోరేజ్ పాయింట్‌కు వచ్చే వస్తువులను ఎప్పటికప్పుడు భద్రపరిచేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వర్షానికి ఎక్కడా కూడా జేవీకే కిట్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో నేడు ఇఫ్తార్ విందు



ముస్లింలతో సమావేశమైన నాగభూషణం, అలీమ్‌బాషా

పుంగనూరు : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారు. శనివారం ఈ మేరకు జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, రాయలసీమ జిల్లాల మైనార్టీసెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్‌షరీఫ్ పట్టణంలోని షాదీమహల్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. విందుకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కూడా హాజరవుతున్నట్లు నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారామన్, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్ సలీం, కార్యదర్శి ఇబ్రహీం, బీటీ అతావుల్లా, మక్కా కమిటీ డైరెక్టర్ ఖాదర్, జావీద్, బీసీ రఫీ పాల్గొన్నారు.

నిరీక్షణకు తెరపడింది...
కల నెరవేరింది



ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేయాలని తపన పడ్డారు.. పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాలని తహతహలాడారు.. వ్యయప్రయాసలకోర్చి టీచర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. కష్టపడి చదివి 1998లో డీఎస్సీ పరీక్షలు రాశారు. అయితే అప్పటి టీడీపీ సర్కారు వ్యవహారశైలితో వందలాది మంది అభ్యర్థుల చేతికొచ్చిన ఉద్యోగం కోర్టు వివాదాల్లో చిక్కుకుంది.. ఇక అప్పటి నుంచి ఉద్యోగార్థుల భవిష్యత్ అంధకారబంధురమైంది.. ఈ క్రమంలో ప్రజాసంకల్పయాత్ర నాడు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డీఎస్సీ అభ్యర్థుల పాతికేళ్ల నిరీక్షణకు తెరదించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 533 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ఏళ్ల తరబడి ఆశనిరాశ నడుమ ఊగిసలాడుతున్న బతుకుల్లో వెలుగులు నింపారు.

- డీఎస్సీ-1998 అభ్యర్థులకు నియామక పత్రాలు
- పాతికేళ్ల అనంతరం పోస్టింగులు
- ఉద్యోగార్థుల్లో హర్షాతిరేకాలు
- వెంటనే విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులుగా నియామకపత్రాలు అందుకున్న డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు

నగరి : ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం 1998 డీఎస్సీ పరీక్షలు రాసి అర్హత పొందిన వారికి ప్రభుత్వం తీపి కబురు అందించింది. దశాబ్దాల ఎదురుచూపులకు తెరదించింది. జీవితంలో అసలు ప్రభుత్వ టీచర్లుగా ఎంపికవుతామా అనే డోలాయమాన పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న అభ్యర్థుల కల సాకారం చేసింది. దీనిపై డీఎస్సీ-1998 అభ్యర్థుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. పాతికేళ్లగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన క్షణం వచ్చేసరికి పలువురు భావోద్వేగానికి గురవుతున్నారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పిదాల కారణంగా తాము ఇన్నేళ్లపాటు ఉద్యోగానికి దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. నియమాకపత్రాలు అందుకున్న పలువురు టీచర్లు తమకు కేటాయించిన పాఠశాలల్లో బాధ్యతలు చేపడుతున్నారు. పిల్లలకు పాఠాలు బోధిస్తూ మురిసిపోతున్నారు. జగనన్న రూపంలో దేవుడు కరుణించాడని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని సంతోషంగా చెబుతున్నారు.

533 మందికి నియామకపత్రాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 533 మంది డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశారు. 25 ఏళ్ల తర్వాత ఉద్యోగ నియామకపత్రాలు పొందిన వారందరూ సంతోషంగా విధుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. నియామకపత్రాలు స్వీకరించిన రోజు నుంచి 15 రోజుల్లోపు సంబంధిత మండల విద్యాశాఖాధికారి వద్ద విధుల్లో చేరాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. ఇప్పటికే పలువురు బాధ్యతలు చేపట్టగా, మరికొంత మంది విధుల్లో చేరేందుకు అవసరమైన ధ్రువీకరణపత్రాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 66 మండలాల్లో 533 మందికి పోస్టింగులు ఇచ్చినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

జగనన్నకు మాత్రమే అర్థమైంది



కోర్టు వివాదాలతో పాతికేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం పోరాడుతూనే ఉన్నాం. అప్పటి నుంచి పాలకులకు విన్నవించుకుంటూనే ఉన్నాం. బతుకుతెరువుకోసం ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ, మా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. మా కష్టం జగనన్నకు మాత్రమే అర్థమైంది. నేడు ఆయన ఇచ్చిన జీఓ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపింది. ఇన్నేళ్ల తర్వాత ఉపాధ్యాయుడిగా పోస్టింగ్ వచ్చింది. వెంటనే బాధ్యతలు చేపట్టా.

– ఎం. భాస్కర్, ఉపాధ్యాయుడు, పాతారూరు ప్రాథమిక పాఠశాల, విజయపురం మండలం

జీవితాంతం రుణపడి ఉంటా



విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నదే నా ఆశయం. అదే 1998లో డీఎస్సీ రాసేలా చేసింది. అయితే కోర్టు వివాదాల కారణంగా నా ఆశ నిరాశగా మారింది. మా కష్టాలు అప్పటి పాలకులు పట్టించుకోలేదు. స్టూడియో నడుపుతూ జీవనం సాగిస్తున్నా. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన ఉత్తర్వులు మా కలలను నెరవేర్చాయి. పాతికేళ్లుగా పడిన శ్రమను మర్చిపోయేలా చేశాయి. ప్రస్తుతం టీచర్‌గా పోస్టింగ్ అందుకున్నా. వెంటనే విధుల్లో చేరి పిల్లలకు పాఠ్యాంశాలు బోధిస్తున్నా. ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా.

– ప్రకాష్, ఉపాధ్యాయుడు, కీళపట్టు బీసీకాలనీ పాఠశాల, నగరి

మాటల్లో చెప్పలేని ఆనందం



సుదీర్ఘ కాలంగా నిరీక్షిస్తున్న ఉద్యోగం వచ్చిందనే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తున్నారు. ఇప్పటికే నాడు–నేడు పనులతో బడులను అత్యున్నతంగా తీర్చిదిద్దారు. గతంలో ఎవరూ ఈ స్థాయిలో విద్యారంగం అభివృద్ధికి కృషి చేయలేదు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 1998 డీఎస్సీ అభ్యర్థులైన మా అందరికీ ఉద్యోగాలు అందించారు. నా కల ఇన్నేళ్లకు నిజమవుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు టీచర్‌గా బాధ్యతలు స్వీకరించా. ఈ క్షణంలో నా అనుభూతి వర్ణనాతీతం.

– నాగరాజు, ఉపాధ్యాయుడు, బీజీ కండ్రిగ ప్రాథమిక పాఠశాల, నింద్ర మండలం

పక్కాగా 'పది' మూల్యాంకనం

- పీసీఆర్‌లో 19 నుంచి 26వ తేదీ వరకు ప్రక్రియ
- సాక్షి ఇంటర్వ్యూలో డీఈఓ విజయేంద్రరావు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షలను ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించింది. విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను పక్కాగా మూల్యాంకనం చేసి ఫలితాలు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. శనివారం ఆఖరి పరీక్ష పూర్తి కావడంతో జవాబుపత్రాలను విద్యాశాఖ జిల్లా కేంద్రానికి తరలించింది. బార్‌కోడింగ్ ప్రక్రియను సైతం ప్రారంభించింది. చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 19వ తేదీ నుంచి మూల్యాంకనం మొదలుకాబోతున్న తరుణంలో డీఈఓ విజయేంద్రరావును సాక్షి పలకరించింది.

సాక్షి : పదో తరగతి మూల్యాంకనం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తున్నారా ?

డీఈఓ : ఈ విద్యాసంవత్సరం పదో తరగతి మూల్యాంకనాన్ని కొత్త జిల్లాల ప్రాతిపదికన నిర్వహించాలని ఉత్తర్వులు అందాయి. ఆ మేరకు చిత్తూరు జిల్లాలోని 31 మండలాల పరిధిలోనే మూల్యాంకనం నిర్వహిస్తున్నాం.

సాక్షి : ఎంత మందిని మూల్యాంకనం విధులకు నియమించారు?

డీఈఓ : మూల్యాంకనం విధులకు 1,200 మందిని కేటాయిస్తున్నాం. ప్రణాళిక ప్రకారం నియామకాలు జరుగుతున్నాయి. ఇందులో ఏఈలు 600 మంది, సీఈలు 200 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 300, ఇతరులు 100 మంది విధులు నిర్వర్తించనున్నారు.

సాక్షి : రోజుకు ఎన్ని జవాబుపత్రాలు దిద్దుతారు ?

డీఈఓ : ఒక్కొక్క అసిస్టెంట్ ఎగ్జామినర్ రోజుకు 40 జవాబు పత్రాలను దిద్దాల్సి ఉంటుంది.

సాక్షి : మూల్యాంకన కేంద్రంలో పర్యవేక్షణ ఎలా ఉంటుంది?

డీఈఓ : విద్యార్థుల ఆన్సర్ స్క్రిప్ట్‌లకు మూల్యాంకనం నిర్వహించేందుకు ముగ్గురిని ఒక బృందంగా ఏర్పాటు చేస్తాం. ఒక్కో బృందం రోజుకు 120 ఆన్సర్ షీట్‌లను దిద్దుతుంది. ముగ్గురు ఏఈలకు ఒక చీఫ్ ఎగ్జామినర్ (సీఈ)తో పాటు ఒక స్పెషల్ అసిస్టెంట్ ఉంటారు. ఏఈలు వాల్యూయేషన్ చేసిన షీట్‌లను సీఈలు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. విద్యార్థులు రాసిన సమాధానాలను తనిఖీ చేసి, వేసిన మార్కులను నిశితంగా పరిశీలిస్తారు. అలాటే ఏఈలు వేసిన మార్కులను టోటల్ చేసి మార్కులను వేసే విధులను స్పెషల్ అసిస్టెంట్లు నిర్వర్తిస్తారు. సీనియర్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు స్పాట్ వాల్యూయేషన్ విధుల్లో సీఈ, ఏఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా వ్యవహరించనున్నారు

సాక్షి : మూల్యాంకనానికి ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

డీఈఓ : ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు స్పాట్ వాల్యూయేషన్ నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాం. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి పకడ్బందీగా వసతులు కల్పిస్తున్నాం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, నియమావళిపై అవగాహన కల్పించేఉదుకు చర్యలు చేపట్టాం.

17న 'వసతి దీవెన'

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్థాయిలో ఈ నెల 17వ తేదీన జగనన్న వసతి దీవెన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి తొలివిడత నగదును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు.

పది పరీక్షలకు 21,449 మంది హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. శనివారం నిర్వహించిన సోషల్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 115 పరీక్ష కేంద్రాల్లో 21,622 మంది విద్యార్థులకు గాను 21,449 మంది హాజరయ్యారు. 173 మంది విద్యార్థులు పరీక్ష కు గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పాలనపై సంతృప్తి..
భవిష్యత్‌పై భరోసా



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై ప్రజలు సంతృప్తిం వ్యక్తం చేస్తున్నారని, తమ భవిష్యత్‌కు భరోసాగా భావిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శనివారం చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్‌కు రాష్ట్రవ్యాప్తంగా 52 లక్షల మిస్డ్ కాల్స్ వచ్చినట్లు వెల్లడించారు. జగనన్న పాలనపై ప్రజల అభిప్రాయాలను గృహసారథులు సేకరించారన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తమ ఇళ్లకు స్టిక్కర్ అంటించుకునేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. 4ఏళ్లుగా అందుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని వివరించారు. అధికార పార్టీపై కొద్ది వ్యతిరేకతతో ఉండేవారిలో కూడా ప్రస్తుతం మార్పు వస్తోందని చెప్పారు. 95 శాతం ప్రజలు ప్రభుత్వ పాలనపై ఆనందంగా ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం చంద్రబాబు చేసిందేమీ లేదని, పేదలకు అందింది ఏమీ లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. సమావేశంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞాన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

19న స్థాయీ సంఘాల సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు 1–7 స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని వివరించారు.

జేసీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పులి శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా తిరుమల శ్రీవారు, కాణిపాకం వినాయకస్వామిని దర్శించుకున్న తర్వాత ఆయన చిత్తూరు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం జేసీగా బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ఆర్డీఓ రేణుక తదితరులు జేసీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూముల రీసర్వేకి అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని వెల్లడించారు.



9 నుంచి తిరుపతి గంగమ్మ జాతర

కుప్పం: పట్టణంలో ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయ జాతరకు ఆలయ కమిటీ శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో జాతర నిలపకుండా శాస్త్రోకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జాతర ఆహ్వాన పత్రికలు ముద్రించి పూజలు చేశారు. మే నెల 9 తేదీ మహోత్సవాలకు అంకురార్పణ, ధ్వజారోహణంతో జాతర చాటింపు చేపడుతారు. 17వ తేదీ రాత్రి వినాయక ఉత్సవంతో జాతర నిర్వహిస్తారు. ప్రధానంగా 19వ తేదీ మధ్యాహ్నం అన్నదానం, 22వ తేదీ ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశం, పుష్పపల్లకి, పలక వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. 23వ తేదీ తిరుపతి గంగమ్మ కళ్ల తెర తొలగించి పురవీధుల్లో శిరస్సు ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఊరేగింపు ముగించుకుని ఆలయం వచ్చిన తరువాత అమ్మవారి విశ్వరూప దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్ తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- మాదకద్రవ్యాల నివారణకు పకడ్బందీ చర్యలు
- సమాచారం అందించేందుకు 14500 టోల్‌ఫ్రీ నంబర్
- కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్, పక్కన ఎస్పీ రిశాంత్‌రెడ్డి

సాక్షి, చిత్తూరు : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ సగిలి షణ్మోహన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నేషనల్ నార్కొటిక్స్ సమన్వయ కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం అజెండాలోని అంశాలను ఎస్పీ రిశాంత్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలోని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో డ్రగ్స్ నివారణకు శ్రమించాలని కోరారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అన్ని పాఠశాలలు, కళాశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం పక్కాగా ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ అధ్యక్షతన ప్రతి నెలా జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో చీఫ్ సెక్రటరీ, దేశ స్థాయిలో కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మూలాల నుంచే గంజాయి విక్రయాలను అరికట్టాలని స్పష్టం చేశారు. తమిళనాడు, కర్ణాటక సరిహద్దులో జిల్లా ఉండడం వల్ల మాదక ద్రవ్యాల రవాణా పెరుగుతోందని, దీన్ని కట్టడి చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి, సింథటిక్ డ్రగ్స్ వాడకం అధికంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల వాటిల్లే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే పలు చోట్ల హోర్డింగ్‌లను సైతం ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించవచ్చని వెల్లడించారు. సమావేశంలో ఏఎస్పీ శ్రీలక్ష్మి, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిపై దిశానిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ షణ్మోహన్ దిశానిర్దేశం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ మేరకు అధికారులు పనిచేయాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందించాలని కోరారు . నాడు–నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల కమిటీలు ప్రతి వారం చేయాల్సిన పనులను నిర్ణయించుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. జగనన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, డీఆర్‌ఓ ఎస్. రాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, సీపీఓ ఉమాదేవి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ ప్రకాశం, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట రమణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ, చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,700

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

మృతదేహం వెలికితీత


రెడ్డిప్రసాద్ (ఫైల్)

పుత్తూరు రూరల్: సదాశివ కోనలో విహారానికి వచ్చి శుక్రవారం గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని శనివారం వెలికి తీసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాలు.. తిరుపతికి చెందిన పది మంది మిత్రులు సదాశివకోనకు వచ్చారు. సాయంత్రం 4–30 గంటల సమయంలో కొత్త చెరువులో స్నానానికి దిగారు. వై.రెడ్డిప్రసాద్(44) అనే వ్యక్తి అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు యత్నించి మధ్యలోనే మునిగిపోయాడు. పోలీసు, ఫైర్ సిబ్బంది చెరువులో గాలింపు చర్యలు చేపట్టినా రెడ్డిప్రసాద్ ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం మట్టిలో కూరుకుపోయిన మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు హౌస్ కీపింగ్ కాంట్రాక్టర్‌గా జీవనం సాగించేవాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి అన్న రెడ్డివేలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలో కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై డీటీఎఫ్(డిస్టిక్ టాస్క్ ఫోర్స్) అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. పలమనేరు సమీపంలోని నాగమంగళం, వీకోట మండలంలోని చిన్నశ్యామ వద్ద గోనుమాకుల పల్లెకు చెందిన రవి(43), బంగారుపాళెం మండలం కీరమందకు చెందిన జీవన్‌కుమార్(20)ను అరెస్ట్ చేశారు. బైక్‌లను, 229 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు డీటీఎఫ్ సీఐ మాధవస్వామి తెలిపారు. సిబ్బంది శ్రీనాథ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో అగ్నిప్రమాదం

కుప్పంరూరల్ : మండలంలోని వెండుగంపల్లెలో ఉన్న గుజిరి దుకాణంలో శనివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది సమయానికి దుకాణం వద్దకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో కొంత సామాగ్రి కాలినట్లు బాధితుడు భరత్‌కుమార్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.4.5 లక్షల సొత్తు స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుత్తూరు రూరల్: అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.4.5 లక్షల విలువైన నగలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పుత్తూరు ఇన్‌చార్జి డీఎస్పీ రామరాజు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. వడమాలపేట మండలం పూడి గ్రామం టీటీడీ బస్ స్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను నారాయణవనం సీఐ సురేష్‌కుమార్ బృందం అదుపులోకి తీసుకుంది. విచారించగా పిచ్చాటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ఇళ్లు, వడమాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక షాపులో చోరీలు చేసినట్లు తెలిసింది. నిందితులు గుంటూరు జిల్లా, ముప్పాల మండలం, మాదాల గ్రామానికి చెందిన వి.మహాంకాళి (33), టి.కోటయ్య(42), టి.నాగరాజు(48), వి.వెంకటేశ్వర్లు(40), వి.దుర్గా రావు(38)గా గుర్తించారు. నిందితుల నుంచి 84 గ్రాముల బంగారు ఆభరణాలు, 125 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీరందరిపై ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇదివరకు పలు చోరీలు, హత్యానేరం, చీటింగ్ కేసులు నమోదయ్యాయి. అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసిన సీఐ సురేష్‌కుమార్, ఎస్‌ఐలు రామాంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్, సిబ్బందికి డీఎస్పీ రామరాజు రివార్డులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పుత్తూరు సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పైపాళ్యం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని 88 ఇండ్లను సందర్శించి సంక్షేమ బావుటా కర పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి అందుతోందని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా క్యాలెండర్ ప్రకారం లబ్ధిదారులకు సంక్షేమాన్ని అందించారని పేర్కొన్నారు. సంక్షేమం ఓ వైపు, అభివృద్ధి ఓ వైపు చేపడుతున్నారని చెప్పారు. కుప్పం నియోజక వర్గంలో ఒక్కో ఇంటికి ఏడు లక్షలు, ఎనిమిది లక్షల రూపాయల లబ్ధి కూడా అందిందని ప్రజలు ఆనందంగా చెబుతున్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంగళహారతులతో స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. ఇవన్నీ జగనన్న చలవే అన్నారు. ఇంతటి సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న జగనన్నకు రానున్న ఎన్నికల్లో జనం కూడా మద్దతుగా నిలవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య, రేషన్‌కార్డు, పెన్షన్లు లాంటి సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ సభ్యుడు శరవణ, నాయకులు మురుగేష్, తిమ్మోజీ , తిమ్మరాయస్ తదితరులు ఉన్నారు.